అనుదినం జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
శనివారం 14 జనవరి 2023

క్యారమ్ బోర్డు పోటీలు ప్రారంభం

నవతెలంగాణ-ముప్కాల్

జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని, మకర సంక్రాంతి పండుగ నిమిత్తం క్రీడాకారులను ప్రోత్సహించేలా మండల కేంద్రంలోని కేజీయం కాంప్లెక్స్ ఆవరణలో ముప్కాల్ క్యారమ్ బోర్డు అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం క్యారమ్ బోర్డు సింగిల్స్, డబుల్స్ పోటీలను ఎస్సై ప్రభాకర్ రెడ్డి ప్రారంభించారు. గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ముప్కాల్ క్యారమ్ బోర్డు అసోసియేషన్ సభ్యులు గిరిస్వామి, చిల్క దినేష్, మ్యాక నర్సయ్య, మోహినోద్దీన్, ముజ్జు తదితరులు పాల్గొన్నారు.


ప్రారంభించిన క్యారం ఆడుతున్న ఎస్ఐ

మొక్కలను రక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత

నవతెలంగాణ-మద్నూర్

చెట్లను రక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని మద్నూర్ సర్పంచ్ సురేష్ తెలిపారు. శుక్రవారం గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో మొక్కలకు నీటిని వదులుతూ వాటరింగ్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెట్లను రక్షించుకుందాం పర్యావరణాన్ని పెంచుకుందామని.. చెట్లను రక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. వాటరింగ్ డే కార్యక్రమంలో ఉపాధి హామీ ప్రోగ్రాం అధికారి పద్మ, ఉప సర్పంచ్ విట్టల్, గ్రామ కార్యదర్శి సందీప్‌కుమార్, పంచాయతీ వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.



సోలార్‌తో కరెంట్‌బిల్లుల నుంచి విముక్తి

- ఏర్పాటుపై స్వయం సంఘాలకు అవగాహన కల్పించాలి
- కలెక్టర్ జితేశ్ వి పాటిల్

నవతెలంగాణ-కామారెడ్డిటౌన్

సోలార్ విద్యుత్‌ను వినియోగించుకుంటే ప్రతినెలా కరెంట్ బిల్లుల చెల్లించే అవసరం ఉండదని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ తెలిపారు. సోలార్ విద్యుత్తు వినియోగంపై స్వయం సహాయక సంఘాల మహిళలకు అవగాహన కల్పించాలని సూచించారు. కామారెడ్డి కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలు శుక్రవారం సోలార్ విద్యుత్తు వినియోగంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. సోలార్ యూనిట్లను దాబాలపై, ఖాళీ స్థలాలు, రేకుల షెడ్లపై ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపారు. విద్యుత్ బిల్లును చెల్లించవలసిన అవసరముండదని చెప్పారు. మహిళలు స్త్రీనిధి ద్వారా రుణాలు పొంది యూనిట్‌ను ఏర్పాటు చేసుకోవచ్చని సూచించారు. ఐకెపి, మెప్మా అధికారులు మహిళా సంఘాల సభ్యులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. అంకోల్ క్యాంపులో మహిళలు సోలార్ విద్యుత్తును వినియోగిస్తూ ఆదర్శంగా నిలిచారని కలెక్టర్ చెప్పారు. మహిళా సంఘాలలో లేని మహిళలు సోలార్ యూనిట్ ఏర్పాటు చేసుకొనే వీలుందని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేష్ దోత్రే, అంకోల్ సర్పంచ్ రాములు, రెడ్ కో, విద్యుత్తు అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

ఈశ్రమ్ బీమాపై అవగాహన కల్పించాలి

ఈశ్రమ్ బీమపై అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కామారెడ్డి కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో ఈశ్రమ్ బీమాపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఉపాధి హామీ కూలీలు, ఆశ కార్యకర్తలు, గొర్రెల మేకల పెంపకం దారులు, మత్స్యకారులు, వీధి వ్యాపారులకు ఈ శ్రమ్ బీమా చేయించుకునే విధంగా అధికారులు అవగాహన కల్పించాలని కోరారు. సమావేశంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేష్ దోత్రే, డి ఆర్ డి ఓ సాయన్న, జిల్లా కార్మిక శాఖ అధికారి సురేందర్, వివిధ శాఖల జిల్లా ఉద్యోగులు పాల్గొన్నారు.

నెలకు రూ.35 వేల ఆదాయం

నవతెలంగాణ-భిక్కనూర్

దళితబంధు పథకంతో పిండి వంటల తయారీ యూనిట్ నెలకొల్పానని, దీంతో నెలకు రూ.35 వేల ఆదాయం వస్తుందని లబ్దిదారుడు మందుగల సుధాకర్ తెలిపారు. పిండి వంటలతో శుక్రవారం కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలగా.. కలెక్టర్ వాటిని కొనుగోలు చేశాడు. రుచి బాగుందని ప్రశంసించారు. భిక్కనూరు మండలం సిద్ధి రామేశ్వర నగర్ గ్రామానికి చెందిన సుధాకర్,శివలత దంపతులకు మొదటి విడతలో దళిత బంధు పథకం కింద రూ.10 లక్షలు మంజూరు అయ్యాయి. వీటితో పిండి వంటల తయారీ యూనిట్ ను నెలకొల్పారు. సిద్ధి రామేశ్వర మిక్చర్ అండ్ బూంది యూనిట్ ద్వారా 11 రకాల నాణ్యమైన మిక్చర్లను తయారుచేసి విక్రయిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడి దయానంద్, భిక్కనూర్ ఎంపీడీవో అనంతరావు, అధికారులు పాల్గొన్నారు.


లబ్ధిదారుడి వద్ద పిండి వంటకాలుకొనుగోలు చేస్తున్న కలెక్టర్

పతంగుల పండుగ వేళ పిల్లలు జాగ్రత్త



- పిల్లలను ఓ కంట కనిపెడుతూ ఉండాలని తల్లిదండ్రులకు పోలీసుల సూచన
- వైర్లు ఉన్న చోట ఎగురవేస్తే ప్రమాదాలు

నవతెలంగాణ-భిక్కనూర్

సంక్రాంతి పండుగ వస్తే చిన్నా పెద్ద తేడా లేకుండా గాలిపటాలు ఎగురవేసేందుకు ఉత్సాహం చూపిస్తుంటారు. ఈ క్రమంలో అదమరిచి ఉంటే ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశాలూ ఉన్నాయి. కావున పండుగ వేళ.. పిల్లలను తల్లిదండ్రులు ఓ కంట కనిపెడుతూ ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

గాలిపటాలను ప్రమాదకరంగా ఉండే దాబాలపై, ఇరుకు సందులలో ఎగురవేస్తే ప్రమాదాలు పొంచి ఉంటాయి. విశాలవంతమైన మైదాన ప్రాంతాల్లో, సురక్షిత ప్రాంతాల్లో ఎగురవేస్తే మేలు అని పోలీసులు సూచిస్తున్నారు. తమ చిన్నారులు గాలిపటాలను ఎగురవేసే సమయంలో తల్లిదండ్రులు పరిశీలించాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది. చిన్నారులు డాబాలపై గాలిపటాలను ఎగురవేయకుండా మైదానంలో మాత్రమే ఎగురవేయాలని, చైనా మాంజాలను వాడకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉంది.

అధికారుల ఆదేశాలు బేఖాతరు..

ఒకవైపు పోలీస్ అధికారులు, ఫారెస్ట్ అధికారులు చైనా మాంజాలను విక్రయించరాదని, ప్రమాదకరంగా ఉండే మాంజాలను వాడరాదని ఎప్పటిక ప్పుడు విక్రయిస్తున్న వారికి ఆదేశాలిస్తున్నా ఇవన్నీ తమకేమీ పట్టనట్టు దొంగ చాటుగా మాంజాల విక్రయం కొనసాగుతోంది. చైనా మాంజాలతో ప్రజలతో పాటు అటు పక్షులకు కూడా ప్రమాదాలు పొంచి ఉన్నాయి.

విద్యుత్ తీగలపై మాంజా పడితే ప్రమాదమే

గాలిపటాలను ఎగురవేస్తున్న సమయంలో విద్యుత్ తీగలపై గాలిపటాలు, మాంజా పడిన ఘటనలు కోకొల్లలు. విద్యుత్ షాక్ తగిలి ప్రాణం పోయే ప్రమాదం ఉంది. గతంలోనూ భిక్కనూర్ పట్టణ కేంద్రంలో యువకుడికి విద్యుత్ తీగలకు మాంజా తగిలి ప్రమాదం జరిగిన ఘటనలు ఉన్నాయి.

ప్రమాదకర మంజాలు విక్రయిస్తే చర్యలు

ఎస్సై ఆనంద్ గౌడ్



ప్రమాదక రమైన మాంజాలను విక్రయిస్తే దుకాణ దారులపై చర్యలు తీసుకుంటాం. ఎక్కడైనా దొంగచాటుగా విక్రయిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. పిల్లలను తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలి

విద్యుత్ తీగలకు దూరంగా ఉండాలి

ఏఈ రామలక్ష్మి



గాలిపటాలు ఎగరవేసే సమయంలో విద్యుత్ తీగలపై మాంజాలు తగిలితే ప్రమాదం జరుగుతుందని ఏఈ రామలక్ష్మి తెలిపారు. గాలిపటాల ఎగరవేసే సమయంలో విద్యుత్ తీగలు లేని చోట ఎగురవేయాలని సూచించారు.

పలువురు తహసీల్దార్లు బదిలీ

నవతెలంగాణ-కామారెడ్డి టౌన్

కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా పలువురు తహసీల్దార్‌లు బదిలీ అయ్యారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా సదాశివనగర్, బిబిపేట్, మాచారెడ్డి, దోమకొండ, తాడ్వాయి, భిక్కనూర్, రాజంపేట్, కామారెడ్డి, రామారెడ్డి మండలాల తహసీల్దార్‌లకు స్థానచలనం చేశారు. కాగా పలువురు తహసీల్దార్‌ను కలెక్టరేట్‌కు ఆటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

పేరు	ప్రస్తుత పోస్టు	బదిలీ అయిన ప్రాంతం
పి ఆనంద్	డివిజనల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్	తహసిల్దార్-రామారెడ్డి
ఎం సురేఖ	తహసీల్దార్-రామారెడ్డి	కలెక్టర్ కార్యాలయం
సునీత	తహసీల్దార్-తాడ్వాయి	కలెక్టర్ కార్యాలయం
ప్రేమ్ కుమార్	తహసీల్దార్-కామారెడ్డి	తహసిల్దార్-భిక్కనూర్
ఎం నర్సింలు	తహసీల్దార్-భిక్కనూర్	తహసీల్దార్-బీబీపేట్
వెంకట్‌రావు	తహసీల్దార్-సదాశివనగర్	తహసిల్దార్-కామారెడ్డి
కే ధనవాల్	రీ పోస్టింగ్	తహసీల్దార్-సదాశివనగర్
టి శాంత	డిప్యూటీతహసీల్దార్ దోమకొండ	తహసీల్దార్-రాజంపేట్
కౌషిక	డిప్యూటీ తహసీల్దార్	తహసీల్దార్-దోమకొండ
జానకి	తహసీల్దార్ రాజంపేట్	కలెక్టర్ కార్యాలయానికి..
మోతిసింగ్	తహసీల్దార్ బీబీపేట్	కలెక్టర్ కార్యాలయానికి..

నాగల్‌గావ్‌లో నీటి కటకట


పంచాయతీ ఆధ్వర్యంలో ట్యాంకర్‌తో నీటి సరఫరా


నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని నాగల్‌గావ్‌లో నీటి కటకట ఏర్పడింది. నాలుగు రోజులుగా భగీరథ నీరు రావడం లేదని, దీంతో గ్రామస్తులకు నీటి ఎద్దడి నెలకొందని సర్పంచ్ కపిల్ పటేల్ తెలిపారు. తాత్కాలికంగా గ్రామపంచాయతీ ట్యాంకర్‌తో నీళ్ల సరఫరా చేస్తున్నట్టు తెలిపారు. గత డిసెంబర్ 28 తేదీన జరిగిన సర్వసభ్య సమావేశంలో మిషన్ భగీరథ అధికారుల తీరుపై ఎమ్మెల్యే షిండే ఆగ్రహం వ్యక్తం చేసినా తీరు మారడం లేదని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. మండలంలో నీటి సమస్యలు తలెత్తకుండా సత్వర పరిష్కారాలు చేయాలని ఆదేశించినా పట్టడం లేదని, పలుమార్లు అధికారులకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చినా పట్టించుకోవడం లేదని సర్పంచ్ ఆరోపించారు. మెయిన్ లైన్ సమస్య వలనే నీటి సమస్య తలెత్తిందని అన్నారు. ఇప్పడికైనా మిషన్ భగీరథ ఉన్నతాధికారులు స్పందించి నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

లింగంపేట్ ఎంపీడీవోగా మల్లికార్జున్‌రెడ్డి

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట ఎంపీడీవోగా మల్లికార్జున్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. లింగంపేట్ ఎంపీడీవో పని చేస్తున్న నారాయణ బదిలీపై బీర్కూర్ వెళ్లడంతో ఆయన స్థానంలో ఎల్లారెడ్డి ఎంపీడీవోగా పని చేస్తున్న మల్లికార్జున్‌రెడ్డి లింగంపేట్‌కు వచ్చారు. కాగా ఆయన మండల పరిషత్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టగా.. పలువురు ప్రజా ప్రతినిధులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మైనార్టీ మండల నాయకులు సహీం, ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ డైరెక్టర్ పతియోద్దీన్, ఏపీఎం శ్రీనివాస్, మైనార్టీ నాయకులు రఫిక్ తదితరులున్నారు.


ఎంపీడీవోను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

దళిత టీచర్‌పై దాడి చేసిన మతోన్మాదులను కఠినంగా శిక్షించాలి

- 17న చలో కలెక్టరేట్ : సీఐటీయూ పిలుపు

నవతెలంగాణ-కంఠేశ్వర్

దళిత టీచర్ మల్లికార్జున్ పై దాడి చేసిన మతోన్మాదులను శిక్షించాలని జనవరి 17న కలెక్టరేట్ కార్యాలయం వద్ద ధర్నాను జయప్రదం చేయాలని సీఐటీయూఐ జిల్లా కమిటీ పిలుపు నిచ్చింది. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాల యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్ మాట్లాడుతూ కోటగిరిలో దళిత టీచర్ మల్లికార్జున్ ను కులం పేరుతో దూషిస్తూ, బలవం తంగా దేవుడు గుడికి తీసుకెళ్ళి బొట్టు పెట్టించి, అతన్ని అవ మానిస్తూ, గ్రామ విధుల్లో ఊరేగించి, అనాగరి క చర్యలకు పాల్పడిన ఆర్ఎస్ఎస్, బిజెపి మతోన్మాద దుండగులు చేసిన దుశ్చర్యలను సిఐటియు జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తున్నట్టు తెలిపారు. కులం పేరుతో దుషించిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టాలని, నిందితులను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ జనవరి 17న జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నాను నిర్వహించి, సామూహిక నిరసన చేపట్టి జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రాలు అందజేయాలని సిఐటియు రాష్ట్ర కమిటీ నిర్ణయించినట్టు తెలిపారు. ఉద్యోగ, కార్మికులంతా ఈ కార్యక్రమంలో పాల్గొని, మనువాదుల దాడికి గురైన మల్లికార్జున్ టీచర్లకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

ఇలాంటి దారుణాలు బిజెపి పాలిత రాష్ట్రాల్లో మరెన్నో జరుగుతున్నాయని, వీటన్నింటి వరంపరలో భాగంగానే కోటగిరి స్కూల్ టీచర్ మల్లిఖార్జున్ పై దాడి జరిగిందని ప్రజానీకం గమనించాలని అన్నారు. మున్నెన్నడూ లేని విధంగా తినే తిండి, కట్టే బట్టపై ఆంక్షలు విధిస్తూ, ఆ పేరుతో భౌతిక దాడులు చేస్తుందని, నేటికి కులవివక్ష అంటరానితనం కొనసాగుతుందని తెలిపారు. జనవరి 17న జరిగే కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నాను కార్మికుల ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ ఉపాధ్యక్షులు ఈవీఎల్ నారాయణ, జిల్లా కోశాధికారి పి స్వర్ణ, జిల్లా కమిటీ సభ్యులు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నూర్జహాన్

ఇష్టం వచ్చినట్టు కొట్టారు.. తిట్టారు

- మానవహక్కుల కమిషన్‌ను ఆశ్రయించిన మాస్టర్‌ప్లాన్ బాధితులు
- ప్లాన్ రద్దు చేసి, పోలీసులపై చర్యలు తీసుకోవాలని విన్నపం

నవతెలంగాణ-కామారెడ్డిటౌన్

మాస్టర్‌ప్లాన్‌ను రద్దు చేయాలని కోరుతూ శాంతియుతంగా నిరసన చేపడితే పోలీసులు ఇష్టం వచ్చినట్టు కొడుతూ బూతులు తిట్టారని రైతులు వాపోయారు. పోలీసులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మాస్టర్‌ప్లాన్ బాధిత రైతులు శుక్రవారం హైదరాబాద్‌లో మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కామారెడ్డి పట్టణ మాస్టర్ ప్లాన్ విషయంలో తమకు నష్టం జరుగుతుందని గత 40 రోజులుగా ఉద్యమ చేస్తున్నామని తెలిపారు. ఈ నెల 5వ తేదీన ర్యాలీ అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు దాదాపు 8 గంటలు వేచి చూసినా కలెక్టర్ రాకపోవటం తో వెనుదిరి గామని తెలిపారు. తర్వాత రోజు కలెక్టర్‌ను కలిసేందుకు వెళ్లగా.. గేటు దగ్గరే పోలీసులు ఆపి బండి సంజయ్‌ను అరెస్ట్ చేశారని, తర్వాత మేం తిరిగి ఇంటికి పోయేటప్పుడు కొంత మంది పోలీసులు కావాలని మమ్మల్ని ఇష్టం వచ్చినట్టు కొట్టారని, బూతులు తిట్టారని వాపోయారు. కావున తమకు జరిగిన అన్యాయం పట్ల ఎవరికి చెప్పుకోవాలో తెలియక మానవ హక్కుల కమిషన్ ఆశ్రాయిం చమని ఆవేదన వ్యక్తం చేశారు. కామారెడ్డి డీఎస్పీ సోమనాథం, కామారెడ్డి రూరల్ సీఐ శ్రీనివాస్‌గౌడ్, దేవునిపల్లి ఎస్ఐ ప్రసాద్, రాజంపేట్ ఎస్ఐ రాజుపై చర్యలు తీసుకోవాలని కోరారు. మాస్టర్ ప్లాన్ వల్ల రైతులకు తీవ్ర నష్టం జరుగుతుందని దాని రద్దుకు కూడా చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.



సస్పెన్షన్ కాదు.. విధుల నుంచి తొలగించాలి

- మరో టీచర్ కుదైజ పై చర్యలు తీసుకోవాలి
- ప్రజా, కార్మిక సంఘాల డిమాండ్

నవతెలంగాణ-ఏర్గట్ల


ఏర్గట్ల జడ్పీహెచ్ఎస్ లో విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన గణిత ఉపాధ్యాయుడు రాజేందర్‌ను సస్పెండ్ చేయడం కాదని, మొత్తానికి విధుల నుండి తొలగించాలని విద్యార్థి, మహిళా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కేవలం సస్పెండ్ చేసి వదిలేయడం సరికాదని, దీంతో పాటు మరో టీచర్ కుదైజపై సైతం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రగతిశీల మహిళా సంఘం, ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం, ప్రగతిశీల యువజన, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు బి.కిషన్, విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నరేంధర్, మహిళా సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు సత్తెక్క, కార్మిక సంఘం ఆర్మూర్ డివిజన్ అధ్యక్షులు జి.కిషన్ మాట్లాడారు. స్కూళ్లల్లో ఇటువంటి ఘటనలు పునరావృతం జరగకుండా ఉపాధ్యాయుడిని విధుల నుండి తొలగించాలన్నారు. రాజేందర్‌కు సహకరించిన టీచర్ కుదైజ పైన ఎటువంటి చర్యలు ఎందుకు తీసుకోలేదని, విద్యార్థులు ఆమెపై లేఖలో స్పష్టంగా రాసినా ఉన్నతవిద్యాశాఖా ధికారులు చోద్యం చూడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. కుదైజ టీచర్‌పై చర్యలు తీసుకోని పక్షంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.


మాట్లాడుతున్న నాయకులు

ఆగిన మరో గుండె

- గుండెపోటుతో ఎన్ఎస్ఎఫ్ కార్మికుడు సాయిలు మృతి

నవతెలంగాణ-బోధన్



గుండెపోటుతో మరో ఎస్ఎస్ఎఫ్ కార్మికుడు మృతిచెందాడు. వారం వ్యవధిలో ఇద్దరు మృతిచెందడంతో కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిజాంషుగర్ ఫ్యాక్టరీలో కార్మికుడిగా పనిచేసిన ఓటర్‌కర్ సాయిలు (55) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందారు. నిజాం షుగర్ ఫ్యాక్టరీ కార్మికులకు ప్రభుత్వం బకాయి వేతనాలు విడుదల చేయకపోవడంతో కార్మికులు మనోవేదనకు గురై గుండెపోటుతో మృతి చెందుతున్నారు. వారం రోజులలో ఇద్దరు కార్మికులు గుండెపోటుతో మృతి చెందడంతో కార్మికులు ఆందోళన చెందుతున్నారు.

వివరాలు మెయిన్‌లో..

నిబద్ధత కలిగిన కార్మిక నాయకుడు.. సాయిలు

- సంతాపం వ్యక్తం చేసిన సీపీఐ(ఎం) జిల్లా కమిటీ

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజాం దక్కన్ షుగర్ ఫ్యాక్టరీ యూనియన్ నాయకులు కామ్రేడ్ ఓటర్ సాయిల్ గుండెపోటుతో శుక్రవారం మరణించడం పట్ల వారి కుటుంబానికి సీపీఐ(ఎం) జిల్లా కమిటీ తీవ్ర సంతాపాన్ని తెలియజేసింది. 1985 నుంచి నిజాం షుగర్ ఫ్యాక్టరీ కార్మికుడిగా పనిచేస్తూ 2022 సంవత్సరంలో రిటర్మెంట్ అయ్యారని పార్టీ జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు తెలిపారు. అయినప్పటికీ రిటైర్మెంట్ బెనిఫిట్స్ ప్రభుత్వం గానీ, ప్రైవేటు యజమాన్యం గాని ఒక రూపాయి కూడా ఇవ్వకుండా మనోవేదనకు గురి చేయడం మూలంగానే గుండెపోటు వచ్చి సాయిలు మరణించారని పేర్కొన్నారు. ఫ్యాక్టరీలో 1985 నుంచి పనిచేస్తూ ఫ్యాక్టరీ యూనియన్‌లో సిఐటియుగా 1985 నుంచి కొనసాగుతూ నేటి వరకు కూడా సీఐటీయులో ఉన్నారని అన్నారు. అలాగే సీపీఐ(ఎం) సభ్యుడుగా 1989 నుంచి కొనసాగినట్టు తెలిపారు. పార్టీలో సభ్యుడి నుంచి శాఖ కార్యదర్శిగా పార్టీ పట్టణ కమిటీ సభ్యుడిగా సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులుగా ఎదుగుతూ ప్రజల కోసం తోటి కార్మికుల కోసం నిస్వార్థంగా నిత్యం కృషి చేశారని అన్నారు. వారికి సీపీఐ(ఎం) జిల్లా కమిటీ తరఫున నివాళులు అర్పించారు.


సాయిలు(ఫైల్)

విరగపూసిన పూత


మామిడి చెట్టునిండా పూత

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఈసారి మామిడి చెట్లకు పూత విరగపూసింది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి పకృతి వైపరిత్యాలు, ఈదురుగాలలు వీయకుండా ఉంటే ఈ సీజన్‌లో ఎక్కువగా మామిడి చేతికి వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఇందల్‌వాయి మండలంలోని గౌరారం గ్రామపంచాయతీ పరిధిలోని లింగాపూర్‌లో ఓ రైతు మామిడి తోటలో విరగబూసిన మామిడి చెట్టును నవతెలంగాణ విలేకరి క్లిక్ మనిపించారు.

పరీక్షల్లో ముగ్గురు డిబార్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో శుక్రవారం ఉదయం జరిగిన యూజీ 2వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షల్లో 4,533 మంది విద్యార్థులకు గాను 4278 మంది హాజరయ్యారని, తెలిపారు. 255 గైర్హాజరయ్యారని, ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రంలో 2వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ ఫిజిక్స్ పరీక్షలో ఒకరు , ఆర్మూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రం లో బిజినెస్ లా పరీక్ష లో ఇద్దరు విద్యార్థులు డిబార్ అయ్యారని తెలిపారు. మధ్యాహ్నం జరిగిన 5వ సెమిస్టర్ (రెగ్యులర్) 6వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షల్లో 8717కు గాను 8066మంది హాజరయ్యారని అన్నారు. 651 మంది గైర్హాజరయ్యారని తెలంగాణ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారిణి ప్రొఫెసర్ డాక్టర్ ఎం. అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. కామారెడ్డిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఆర్‌కె డిగ్రీ, మంజీరా డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రాలను నియంత్రణ అధికారిణి ప్రొఫెసర్ డాక్టర్ అరుణ ఆకస్మికంగా తనిఖీ చేశారు.

అనుదినం జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్

ప్రజలకు సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు

• పోలీస్ కమిషనర్ వెల్లడి

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ ప్రజలందరికి సంక్రాంతి పర్వదిన సందర్భంగా నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కేఆర్ నాగరాజు తరపున అలాగే నిజామాబాద్ పోలీస్ శాఖ తరపున పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఇంటిళ్లపాది అంగరంగ వైభవంగా మూడు రోజుల పాటు భోగి, సంక్రాంతి, కనుమ పండుగలను జరుపుకోవడం మన అందరి సాంప్రదాయం, ప్రజలందరు వారి కుటుంబ సభ్యులతో నిండు ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో జీవించాలని కోరుతున్నానన్నారు. ఎల్లప్పుడు ప్రజలు పోలీస్ సిబ్బంది స్నేహపూర్వకంగా సోదరభావంతో మెలగాలని కోరుకుంటున్నానని తెలిపారు. ప్రతీ ఒక్కరు కోవిడ్-19 నిబంధనలు తప్పకుండా పాటించాలని తెలిపారు.

పోటీల ద్వారా సృజనాత్మకత వెలికితీయొచ్చు

• మేయర్ దండునీతూ కిరణ్

నవతెలంగాణ-కంఠేశ్వర్/ఆర్మూర్

పోటీల ద్వారా సృజాత్మకతన వెలికితీయొచ్చని మేయర్ దండు నీతూ కిరణ్ అన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా నగరంలోని కలెక్టర్ గ్రౌండ్‌లో నగర పాలక సంస్థ మేయర్, కార్పొరేటర్ల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ముగ్గుల పోటీలో మహిళలు యువతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ దండు నీతూ కిరణ్ శేఖర్ మాట్లాడుతూ.. మహిళల్లోని సృజనాత్మకతను సమాజంలో జరుగుతున్న పరిణాలను, మన సంస్కృతి సంప్రదాయాలను తెలియజేస్తూ ముగ్గుల రూపంలో వేసి వారిలోని ఆలోచనలను ఆవిష్కరించారని అన్నారు. ఈ పోటీలో కుల, మతాలకు అతీతంగా మహిళలు యువతులు, బాలికలు పాల్గొనటం ద్వారా వాళ్లలోని ఆసక్తిని ప్రదర్శించి నందుకు ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని మహిళ కమిషన్ మెంబెర్ సూదంం లక్ష్మి, డిస్ట్రిక్ట్ ఉమెన్ అండ్ చైల్డ్ డెవలప్మెంట్ ఆఫీసర్ సంధ్యారాణి, ముఖ్య అతిథులుగా పాల్గొని ముగ్గులను పరిశీలించారు. సమాజంలో జరుగుతున్న పరిణామాలకు అద్దం పట్టే విధంగా ప్రస్తుత పరిస్థితులపై వారికీ ఉన్న అవగాహనను తెలిసే విధంగా ముగ్గుల వేసిన వారిని అభినందించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులను మేయర్ ప్రదానం చేసారు. కల్పన మొదటి బహుమతి రూ. 5వేలు, భవాని రెండవ బహుమతి రూ.3వేలు, జ్యోతి మూడో బహుమతి రూ.2వేలు, జయలక్ష్మి నాలుగో బహుమతి వెయ్యి, హీనా ఐదవ బహుమతి 500 గెలుచుకున్నారు. పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి టిఫిన్ బాక్స్‌లను అందించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన మున్సిపల్ సిబ్బంది, మెప్మా సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.



ఆర్మూర్ : బాలుర ఉన్నత పాఠశాలలో



కంఠేశ్వర్ : ముగ్గులను పరిశీలిస్తున్న మేయర్,

బాలుర ఉన్నత పాఠశాలలో...

ఆర్మూర్ :పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం బిర్లా శక్తి సిమెంట్ వారి ఆధ్వర్యంలో మహిళలకు, యువతులకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బిర్లాశక్తి సిమెంట్ జోనల్ ఇంచార్జ్ రవి శంకర్, బ్రాంచ్ మేనేజర్ వినయ్ కుమార్ ,సేల్స్ మేనేజర్ నాగేష్ ,డిపో మేనేజర్ జనగామ బాలు తదితరులు పాల్గొన్నారు.

రాంపూర్ (డి) లో బూత్ కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మండలంలోని రాంపూర్ (డి) గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ బూత్ స్థాయి కమిటీలను శుక్రవారం నియమించారు. కార్యక్రమంలో శ్రీనివాస్ రెడ్డి, రైతు సమన్వయ సమితి అధ్యక్షులు నారాయణ రెడ్డి, రాంపూర్ సహకార సొసైటీ చైర్మన్ తారాచంద్ నాయక్, సీనియర్ నాయకులు, మాజీ మండల పార్టీ అధ్యక్షులు శక్కరకొండ కృష్ణ, నీరడి పద్మారావు, నల్లవెల్లి సాయిలు, మోహమ్మద్ యూసుఫ్, సర్పంచులు పాపయి తిరుపతి, నడపన్న, ఒడ్డం నర్సయ్య, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు దండుగుల సాయిలు, యూసుఫ్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు విట్టల్ రాథోడ్, యూత్ అధ్యక్షుడు అమీర్, సెక్రెటరీ గిరి, నాయకులు సతీష్ రెడ్డి, గంగాధర్, పోతర్ల రవి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు ప్రమోద్, రాంపూర్ గ్రామ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆయిల్ ఫామ్ పంటసాగుపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఏడీఏ మల్లయ్య

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలకేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం రైతులకు ఆయిల్ ఫామ్ పంటపై భీంగల్ డివిజన్ వ్యవసాయ సంచాలకులు మల్లయ్య అవగాహన కల్పించారు. ఆయిల్ ఫామ్ పంట ఆవశ్యకత-లాభాలను వివరించారు. అనంతరం రైతులకు పంట గురించి సలహాలిస్తూ, వారి సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉపేందర్ రెడ్డి,జడ్పీటీసీ గుల్లె రాజేశ్వర్, ఎంపీటీసీ జక్కని మధుసూదన్, ఏఓ అబ్దుల్ మాలిక్, ఎంపీడిఓ రాజేశం,రైతు బంధు జిల్లా సభ్యుడు నెరేళ్ళ లింగారెడ్డి, మండలాధ్యక్షుడు సున్నపు అంజయ్య, ఏర్గట్ల పీఏసీఎస్ చైర్మన్ బర్మ చిన్న నర్సయ్య, తాళ్ళరాంపూర్ ఉపసర్పంచ్ క్యాతం దేవేందర్, బోనగిరి రమేష్, ఏఈఓ లు సాయి సచిన్, లిఖిత పాల్గొన్నారు.

క్షత్రియ సమాజ్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న క్షత్రియ సమాజ్‌వారు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని మామిడిపల్లి క్షత్రియ సమాజ్ అధ్యక్ష, కార్యదర్శులు ఖాందేష్ సుదర్శన్ అల్జాపూర్ నందకిషోర్ ఆధ్వర్యంలో క్షత్రియ సమాజ్ క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా టీఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జి ఆశన్నగారి రాజేశ్వర్ రెడ్డి విచ్చేసి క్యాలెండర్ ఆవిష్కరించి మాట్లాడారు. క్షత్రియ సమాజ్ సభ్యులు అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ అందరికి ఆదర్శంగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి ఆశన్నగారి రాజేశ్వర్ రెడ్డి, చైర్మన్, కౌన్సిలర్లకు సమాజ్ సభ్యులు శాలువా పూల మాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పండిత్ పవన్, ప్రాంతీయ క్షత్రియ సమాజ్ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి ఖాందేష్ శ్రీనివాస్, మున్సిపల్ కౌన్సిలర్లు సంగీతా ఖాందేష్, అల్జాపూర్ రేవతి, బారడ్ రమేష్ , సమాజ్ ఉపాధ్యక్షులు రవీందర్, కిషన్ , కోశాధికారి గుజరాతీ రామ్ దాస్, సంయుక్త కార్యదర్శులు కుబీర్ మోహన్, ప్రభాకర్, కార్యవర్గ సభ్యులు జెంటిల్ కిడ్ ప్రకాష్, డిష్ ప్రకాష్ , రాజేష్ , అల్జాపూర్ గంగా మోహన్ , సురేష్ , మోహన్ , బోచ్కర్ సుదర్శన్ , గంగా మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగును ప్రజల్లోకి తీసుకెళ్లాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

నవతెలంగాణ-భీంగల్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ ఆర్మూర్ మహేష్, జెడ్పీటీసి చౌట్‌పల్లి రవి తెలిపారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జెడ్పీటీసి మాట్లాడారు. రాష్ట్రంలో కంటి వైద్యం గురించి ఏ ఒక్కరు బాధపడకూడదని అన్ని వర్గాల ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు సీఎం కేసీఆర్ కంటి వెలుగు పథకాన్ని ప్రవేశపెట్టి అందరికి ఉచితంగా అందజేస్తున్నారని అన్నారు. కనుక కంటి సమస్యలు ఉన్న వారు సద్వినియోగం చేసుకునేలా గ్రామాల్లో తెలియజేయాలని సూచించారు. అలాగే మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ కన్నె ప్రేమలత అధ్యక్షతన కంటి వెలుగుపై అవగాహన కార్యాక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేశ్వర్, తహసీల్దార్ శ్రీధర్‌కుమార్, ఎంపీవో గంగమోహన్, ఏపీవో నర్సయ్య, ఏపీఎం కుంట శ్రీనివాస్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఆయా శాఖల అధికారులు ఉన్నారు

సహాయనిధి వరం లాంటిది

• ఎమ్మెల్సీ వి గంగాధర్ గౌడ్



సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్సీ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు, నిరుపేదలకు వరం లాంటిదని ఎమ్మెల్సీ వి గంగాధర్ గౌడ్ అన్నారు. శుక్రవారం ఎమ్మెల్సీ క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును లబ్దిదారులకు అందజేశారు. కార్పొరేట్ లో వైద్యం చేయించుకున్న నిరుపేదలకు నేనున్నానంటూ భరోసా కల్పిస్తూ సీఎం సహాయ నిధి అందజేస్తున్నారని అన్నారు. అనంతరం ఇందల్ వాయి మండలకేంద్రంలోని తిర్మన్‌పల్లి గ్రామానికి చెందిన డి. భాగ్యకు రూ.28వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి చింతల దాస్, బీఆర్ఎస్ తిర్మన్ పల్లి గ్రామ శాఖ అధ్యక్షులు ప్రవీన్‌గౌడ్ పాల్గొన్నారు.

పద్మశాలీలు రాజకీయంగా ఎదగాలి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న పద్మశాలీలు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

రాష్ట్రంలో అధిక సంఖ్యలో ఉన్న పద్మశాలీలు రాజకీయంగా ఎదగాలని పద్మశాలి రాష్ట్ర కన్వీనర్ బూర మల్లేశం అన్నారు. మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో పద్మశాలీ భవన్‌లో మండల క్యాలెండర్ ఆవిష్కరణకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. క్యాలెండర్ ఆవిష్కరణ అనంతరం ఆయన మాట్లాడుతూ... పద్మశాలీలు ఐక్యతలో ఉన్న నాయకత్వ లోపంతో వెనుకబడి ఉన్నారని అన్నారు. మండల, గ్రామ కేంద్రాల్లో పద్మశాలీల సామాజిక భవనాల మంజూరుకోసం కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు యాదగిరి హనుమాన్లు, నిజామాబాద్ రూరల్ పద్మశాలీ సంఘం అధ్యక్షులు జగదీష్, మండల అధ్యక్షుడు శ్రీపతి శేఖర్, జిల్లా యూత్ ఉపాధ్యక్షుడు కన్నేపల్లి ప్రసాద్, మండల యువజన సంఘం అధ్యక్షుడు అంకం నరేష్, పద్మశాలీలు తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు

• ఎస్ఎఫ్ఐ, ఐద్వా ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ)-అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా శుక్రవారం నిజామాబాద్ నగరంలోని కోటగల్లీలోగల గర్ల్స్ జూనియర్ కళాశాలలో ముగ్గుల పోటీ నిర్వహించి బహుమతులు అందజేశారు.. ఈ సందర్భంగా ఎస్ ఎఫ్ ఐ-జి ఎస్ సి సి జిల్లా కన్వీనర్ దీపిక, ఐద్వా జిల్లా కార్యదర్శి సబ్బని లత మాట్లాడుతూ.. విద్యారంగ సమస్యలపై పోరాటాలతో పాటు వివిధ సందర్భాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులలో ఒక నూతన ఉత్తేజాన్ని నింపడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి మహేష్ ఐద్వా జిల్లా అధ్యక్షులు సుజాత, ఉపాధ్యక్షురాలు లక్ష్మీ, సహాయ కార్యదర్శి అనిత, ఎస్ ఎఫ్ ఐ నగర ఉపాధ్యక్షులు గణేష్, శైలజ, తదితరులు పాల్గొన్నారు.



ముగ్గులపోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు



బహుమతులు అందజేసిన నాయకులు

వరి, పసుపులో మొగిపురుగు బెడద

•నివారణకు రైతులకు పలు సూచనలు

నవతెలంగాణ-ధర్పల్లి

ప్రస్తుత వాతావరణ పరిస్థితులవల్ల వరి, పసుపు పంటకు మొగిపురుగును గుర్తించినట్టు మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్ కుమార్ తెలిపారు. వరి నాటి నెల సమయం అవుతున్నందున మొక్కదశలో వాతావరణ మార్పులవల్ల సహజంగా, అలాగే పసుపుకు ఎరుపు రంగు పీలికలు కనపడుతున్నాయని అన్నారు. మండ లంలో పలు గ్రామాల్లో చాల చోట్ల పంటలకు క్షేత్ర స్థాయిలో పర్యటనకు వెళ్ళినప్పుడు వీటిని గమనించామన్నారు. ఇలాంటి సమయంలో రైతులు నారు మడిలో అయితే ఎకరానికి కిలో కార్బోపోలాన్ 3జి గుళికలు పొలం వేసే వారంలోపు చల్లుకోవాలని సూచించారు. ప్రధానంగా పొలంలో జింకు లోప లక్షణాలు కనిపిస్తే జింకు లోప నివారణకు రెండుగ్రాముల జింకు సరిఫైడ్‌ను లీటర్ నీటిలో కలిపి లేదా ఇసోప్రొమోలిన్ 0. 5మిల్లి లీటర్లు లేదా కాసుగా మైసిన్ 2.5 మిల్లి లీటర్ నీటిల్ కలిపి పిచికారి చెయ్యాలని సూచించారు. కార్యక్రమంలో ఆయాగ్రామాల రైతులు సహాయక వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.



ధర్పల్లి : పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

(వేల్పూరు) ఆర్మూర్ :మండలం మోతే గ్రామంలో మండల వ్యవసాయ అధికారి నర్సయ్య శుక్రవారం వరి పంటను పరిశీలించారు. ప్రస్తుతం చలితీవ్రత అధికంగా ఉండటంవల్ల జింక్ లోపం గమనించారు. జింక్ లోప నివారణకు చిలేటెడ్ జింక్-1 కేజీ ఎకరాకు స్ప్రే చేయాలని, వరి పంటలో ప్రస్తుతం ఉల్లికోడు, తాటాకు తెగులు మరియు మోగి పురుగు గమనించడం జరిగినది. వీటి నివారణకు ఫిప్రోనిల్ 0.6 గుళికలు 4కేజీ ఒక ఎకరాకు వాడాలని లేదా కర్టప్ హైడ్రా క్లోరైడ్ గుళికలు 4 కేజీ ఒక్క ఏకరాకు వాడుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యసాయాధికారి నర్సయ్య, మోతే పాక్స్ ఛైర్మన్ రాజేశ్వర్, ఏఈఓ శబీర్ రైతులు పాల్గొన్నారు.

వంజరిసంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ రాష్ట్ర వంజరి సంఘం నిజామాబాద్ శాఖ అధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను నిజామాబాద్ జిల్లా కలెక్టర్ నారాయణ్ రెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. వారి కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో నిజామాబాద్ రాష్ట్ర వంజరి సంఘం సభ్యులు పాల్గొన్నారు. సంఘం ఉపాధ్యక్షులు మాస్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వంజరి సంఘం క్యాలెండర్ ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. సమాజంలో ప్రత్యేక గుర్తింపు అనేది ఇటువంటి కార్యక్రమాల వల్ల వస్తుందని, రానున్న రోజుల్లో సంఘం తరపున ఆడపిల్లలు చదువులు, ఉపాధి నిమిత్తం మహిళలకు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించబోతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి నిజామాబాద్‌కు చెందిన తెలంగాణ రాష్ట్ర సంఘ సభ్యులు కాలేరు గడ్డం శ్రీనివాస్, గోపాల్ శ్రీనివాస్ (అయ్యప్ప), కాలేరు సురేష్ పాల్గొన్నారు.

మిషన్ 100 ద్వారా లక్ష్యాలను చేరుకోవాలి

• యూఎస్ఏలో ఉన్నత విద్య, ఉద్యోగాలపై విద్యార్థులకు అవగాహన

నవతెలంగాణ-ఆర్మూర్

రోటరీ క్లబ్ ఆఫ్ నిజామాబాద్ గ్లోబల్ ఎన్ఆర్ఐ ఫోరం యూఎస్ఏ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం చేపూర్ క్షత్రియ ఇంజనీరింగ్ కళాశాలలో గ్రాడ్యుయేషన్లు చదివి ఉన్నత విద్యనభ్యసించాలని లక్ష్యంతో ఉన్న విద్యార్థులకు యూఎస్ఏలో విద్య ఆ తర్వాత ఉద్యోగ అవకాశాలపై అవగాహన సదస్సును ఏర్పాటు చేసినట్టు రోటరీ క్లబ్ ఆఫ్ నిజామాబాద్ అధ్యక్షులు సతీష్ షాహ ప్రధాన కార్యదర్శి డాక్టర్ విశాల్ ఆకుల తెలిపారు. ఈ కార్యక్రమానికి గ్లోబల్ ఎన్నారై ఫోరం యూఎస్ఏ హాజరై విద్యార్థుల సంశయాలను తీర్చి వారికి సలహాలు, సూచనలు అందజేశారు. యూఎస్ఏ ఎలా వెళ్లాలి.. ఎటువంటి యూనివర్సిటీలను ఎన్నుకోవాలి.. వీసాలను ఎలా పొందాలి అనే అంశాలపై సూచనలిచ్చారు. ఉన్నత లక్ష్యంతో ఉన్న విద్యార్థులకు అమెరికా వెళ్లాలని కలలను సాకారం చేయటానికి వారికి ఏ విధంగా వెళ్లాలి అనే అంశాలపై గాంధీయన్ సొసైటీ రోటరీ క్లబ్ నుంచి నిజామాబాద్ 2019-20 రో.దర్శన్ సింగ్ సాఖి కార్యవర్గం ఆధ్వర్యంలో సంయుక్తగా మిషన్ 100 ను ప్రారంభించి రెండు సంవత్సరాల నుండి దాదాపు 50 మంది విద్యార్థులకు సలహాలు సూచనలు అందజేయటం ద్వార అమెరికాలో ఉన్నత చదువులకు వినియోగించుకునేలా ప్రోత్సాహాన్ని కలగజేశామన్నారు. వెళ్లాలనుకునే విద్యార్థులు మిషన్ 100 ద్వారా తగిన సలహాలు సూచనలు పొంది తమ లక్ష్యాలను చేరుకోవాలని అన్నారు. సదస్సులో గ్రాడ్యుయేషన్లు, బీటెక్ విద్యార్థులు పాల్గొన్నారు. సమావేశం లో రోటరీ క్లబ్ ఆఫ్ నిజామాబాద్ సభ్యులు శ్రీరామ్ సోనీ ఆకుల అశోక్, అధికారులు జి. రామకృష్ణ, ట్రైనర్ చంద్రశేఖర్ , కళాశాల యజమాన్యం అక్షయ్ వీరేందర్ నరేందర్ , తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న గ్లోబల్ ఎన్నారై ఫోరం యూఎస్ఏ ప్రతినిధులు

పన్నుల వసూలుకు నోటీసుల అందజేత

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్ వాయి మండల కేంద్రంలోని తిర్మన్ పల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఇంటింటికీ తిరుగుతూ డిమాండ్ నోటీసులు అందజేస్తున్నట్టు గ్రామ పంచాయతీ కార్యదర్శి తిరునగరి శ్రీధర్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ లో పేరుకు పోయిన ఇంటి, ఇతర పన్నులను చెల్లించాలని డిమాండ్ నోటీసులు జారీ చేయడం జరిగిందని వివరించారు. ప్రతి ఒక్కరూ ఇంటి పన్నులు చెల్లించి గ్రామ పంచాయతీకి సహకరించాలని అన్నారు. పన్నులు చెల్లిస్తేనే గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టవచ్చని, ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు. ఇప్పటికే పన్ను వసూళ్లకు నోటీసులు అందజేసి నట్లు చెప్పారు. కార్యక్రమంలో కారోబర్ నరేందర్, సిబ్బంది తదితరులున్నారు.



నోటీసులు అందజేస్తున్న జీపీ కార్యదర్శి

కిరాణా షాపులో చోరీ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్‌వాయి మండలకేంద్రంలోని గంగారాం గ్రామ పంచాయతీ పరిధిలో గురువారం అర్ధరాత్రి జాతీయ రహదారి 44వ సర్వీస్ రోడ్డుకు ఆనుకుని ఉన్న ఒక కిరాణా జనరల్ స్టోర్‌లో దొంగతనం జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు షాపు వెనుక ఉన్న వెంటిలేటర్‌ను రాడుతో పగలగొట్టి షాపులోనికి చొరబడి 6వేల రూపాయల నగదు, నాలుగువేల రూపాయల విలువగల సరుకులను ఎత్తుకెళ్లినట్టు కిరాణా షాప్ యజమాని విలేకరులకు తెలిపారు. శుక్రవారం ఉదయం షాపు తీయడానికి వచ్చిన యజమాని షాపునకు తాళం వేసినట్టే ఉండడంతో లోనికి వెళ్లి వెళ్లే వరకూ దొంగతనం జరిగిన విషయం తెలియలేదని యజమాని ఎండి ఆరీఫ్ అన్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారని ఎస్ఐ నరేష్ తెలిపారు.

ప్రమాదకర మాంజాలను విక్రయిస్తే చర్యలు తప్పవు

నవతెలంగాణ-భిక్కనూర్

మండల కేంద్రంలో సంక్రాంతి పండుగ సందర్భంగా స్థానిక గాంధీ చౌరస్తాలో గాలిపటాలు అమ్ముతున్న దుకాణాలను ఫారెస్ట్, పోలీసు అధికారులు శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రమాదకరమైన మాంజాను విక్రయించవద్దని, ఎవరైనా అక్రమంగా విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీలో ఎస్ఐ ఆనంద్‌గౌడ్, ఫారెస్ట్ అధికారి అనురాంజని, బీట్ ఆఫీసర్ దీపిక, పోలీసు, ఫారెస్ట్ సిబ్బంది ఉన్నారు.


గాలిపటాల దుకాణాలను తనిఖీ చేస్తున్న అధికారులు

నాటిన ప్రతి మొక్కనూ రక్షించాలి

- ఎంపీడీవో

నవతెలంగాణ-భిక్కనూర్

మండల కేంద్రంలో ప్రధాన రహదారి డివైడర్‌పై నాటిన మొక్కలను రక్షించేందుకు పంచాయతీ సిబ్బంది కృషి చేయాలని ఎంపీడీవో అనంతరావు సూచించారు. శుక్రవారం వాటర్ డేను పురస్కరించుకొని స్థానిక చౌరస్తాలో నూతనంగా నాటిన మొక్కలకు పట్టణ సర్పంచ్ తునికి వేణుతో కలిసి నీరు పోశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బోడ నరేష్, పంచాయతీ కార్యదర్శి సదాశివ్, వార్డు సభ్యులు వెంకట్రాజం, బాలరాజు, చంద్రం, నాయకులు ప్రభాకర్, పంచాయతీ సిబ్బంది, తదితరులున్నారు.


మొక్కకు నీరు పదుతున్న దృశ్యం

మండల కేంద్రంలో ద్విచక్ర వాహనం చోరీ

నవతెలంగాణ-భిక్కనూర్

మండల కేంద్రంలో స్థానిక గాంధీ చౌక్ సమీపంలో పట్టణానికి చెందిన సంపత్ అనే యువకుడికి చెందిన పల్సర్ ద్విచక్ర వాహనాన్ని ఇంటి ఎదుట నిలిపిఉంచగా.. శుక్రవారం తెల్లవారుజామున గుర్తుతెలియని దుండగులు ద్విచక్ర వాహన తాళాలను పగులగొట్టి ఎత్తుకెళ్లారు. ఈ మేరకు బాధితుడు స్థానిక పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయగా.. ఎస్ఐ ఆనంద్‌గౌడ్ ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఆరుబయట నిలిపే వాహనదారులు హ్యాండిల్ లాక్‌తో పాటు పెట్రోల్ లాకును వేసుకోవాలని సూచించారు.

సమస్యల పరిష్కారానికి వినతి

నవతెలంగాణ-సదాశివనగర్

తెలంగాణ గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాథోడ్ అశోక్ సింగ్ ఎమ్మెల్సీ డి.రాజేశ్వరరావును శుక్రవారం నిజామాబాద్‌లోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో కలిసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంట తెలంగాణ గిరిజన ఉద్యోగుల సంఘం రమేష్‌నాయక్, సంతోష్‌నాయక్, విజయ్, కృష్ణ, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

జానకంపేటలో అభివృద్ధి పనులకు భూమిపూజ

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని జానకంపేట గ్రామంలో సీడీపీ నిధులతో అభివృద్ధి పనులకు ప్రజాప్రతినిధులు, అధికారులు శుక్రవారం భూమిపూజ నిర్వహించారు. మైనార్టీల కోసం శ్మశానవాటిక నిర్మాణ పనుల గాను రూ.ఐదు లక్షలు, దళిత సంఘ భవన నిర్మాణానికి రూ.5లక్షల నిధులు మంజూరు కావడంతో అభివృద్ధి పనులకు స్థానిక ప్రజాప్రతినిధితోపాటు ఎడపల్లి ఎంపీపీ కే శ్రీనివాస్, జెడ్పీ ఉపాధ్యక్షురాలు రజిత ఎల్లయ్య యాదవ్ భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సాయిలు, ఎంపీటీసీ సభ్యులు, టీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి మంద సంజీవ్ కుమార్, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామపెద్దలు, యువకులు, టీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శేషాద్రిఫారంలో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నవతెలంగాణ-కోటగిరి

పోతంగల్ మండలంలోని హెగ్డోలి పంచాయతీ పరిధిలోని శేషాద్రిఫారం గ్రామంలో సీసీ రోడ్డు పనులను రూ.16 లక్షల నిధులతో శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బాన్సువాడ బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొని భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బాల్‌థాకరే, ఎంపీటీసీ ఉమా రాంబాబు, మండల రైతు కన్వీనర్ కొల్లూరు కిషోర్ బాబు, ఎంపీటీసీ విఠల్, నాయకులు నీరడి గంగాధర్, లక్ష్మణ్ పటేల్, శివరాజు పటేల్, గ్రామస్తులు శాంబాబు, ప్రభాకర్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న క్రికెట్ టోర్నమెంట్

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

మండల కేంద్రంలోని ఉమ్మడి గ్రామపంచాయతీ పోచారం తండా పరిధిలోని జై సేవాలాల్ యూత్ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ కొనసాగుతోంది. ఈ టోర్నమెంట్‌లో మొత్తం 40 టీంలు పాల్గొంటున్నాయి. మూడు రోజుల నుంచి కొనసాగుతున్న క్రికెట్ టోర్నమెంట్‌లో పలు టీంలో యువ క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చూపుతున్నారు. ఈ టోర్నమెంట్‌లో గెలుపొందిన జట్లకు మొదటి బహుమతి రూ.35,001, రెండవ బహుమతి రూ.22,222 అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

మేనూరులో ప్రచారం

నవతెలంగాణ-మద్నూర్


మండలంలోని మెనుర్ గ్రామంలో జుక్కల్ మాజీ ఎమ్మెల్యే, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార పాల్గొని ప్రజలకు కేంద్ర ప్రభుత్వ పథకాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. మండల ప్రధాన కార్యదర్శి చట్లావార్ హన్మండ్లు, కొండావార్ వీరేశం, కృష్ణపటేల్, యాదవ్‌రావు, వెంకట్‌కాలే, యోగేష్, శ్రీధర్ పంతులు, అరుణ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

రిలే దీక్షలలో బార్ అసోసియేషన్ ప్రతినిధులు

నవతెలంగాణ-బోధన్

బోధన్ జిల్లా సాధన కొరకు బోధన్ కోర్టు ఎదురుగా నిర్వహిస్తున్న రిలే దీక్షలు శుక్రవారం నాటికి 26వ రోజుకు చేరాయి. ఈ దీక్షలలో బార్ అసోసియేషన్ ప్రతినిధులు గంగారెడ్డి, దత్తాత్రి కులకర్ణి, శంకర్, గుమస్తాల సంఘం అధ్యక్షులు గంగాధర్ కూర్చున్నారు. వీరికి సీనియర్ న్యాయవాదులు హనుమంతరావు, కాంగ్రెస్ నాయకులు ఫయాజ్ ఉద్దీన్ సంఘీభావం తెలిపారు.

ప్రకృతివనాన్ని ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలి


ప్రకృతివనంలో మొక్కలకు నీరు పదుతున్న దృశ్యం

నవతెలంగాణ-పిట్లం

ప్రకృతి వనాన్ని ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని ఎంపీడీవో వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం మండల కేంద్ర గ్రామపంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన బృహత్ పల్లె ప్రకృతి వనంలో ఉపాధిహామీ కూలీలతో కలిసి వాటరింగ్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రకృతివనంలో నాటిన మొక్కల ఎదుగుదలకు క్రమం తప్పకుండా నీటినందించి, కలుపు మొక్కలను తొలగించాలని, ఎప్పటికప్పుడు రక్షణ చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఏపీవో శివకుమార్, పంచాయతీ కార్యదర్శి యాదగిరి, ఫీల్డ్ అసిస్టెంట్ అప్రోచ్ తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగుకు పకడ్బందీ ఏర్పాట్లు

- వైద్యాధికారులు
- పలుచోట్ల వైద్య సిబ్బందికి అవగాహన
- ట్రయల్ రన్


ఎడపల్లి : మోస్రా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కంటివెలుగుపై అవగాహన


కోటగిరిలో..

నవతెలంగాణ-విలేకరుల బృందం

కంటి వెలుగుకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్టు వైద్యాధికారులు సూచించారు. జిల్లా వ్యాప్తంగా పలు మండల కేంద్రాలతో పాటు పుల గ్రామాల్లో రెండో విడత కంటి వెలుగు కార్యక్రమంపై అవగాహన కల్పించారు. దానికి సంబంధించిన ఏర్పాట్లపై వైద్య సిబ్బందికి ఉన్నతాధికారులు పలు సూచనలు చేశారు.

లింగంపేట్ : ఈ నెల 18 నుంచి ప్రారంభమయ్యే కంటి వెలుగు రెండో విడత కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని ఎల్లారెడ్డి డీఎల్‌పీఓ సురేందర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఇందిరాక్రాంతి పథకం కార్యాలయంలో గ్రామపంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో ముందస్తుగా చాటింపు నిర్వహించాలన్నారు. 18 సంవత్సరాల పైబడిన దృష్టిలోపం ఉన్నవారిని కంటి వెలుగు కార్యక్రమం పాల్గొనేలా చేయాలని ఆయన సూచించారు. ఈనెల 18న లింగంపేట్ మండలంలోని లింగంపేట్, మోతే గ్రామాలలో కంటి వెలుగు కార్యక్రమం అట్టహాసంగా ప్రారంభించనున్నట్టు వివరించారు. గ్రామాల వారిగా కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేయనున్నట్టు వివరించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి హిమబిందు, ఎంపీడీవో నారాయణ, ఎంపీఓ ప్రభాకర్‌చారి, ఏపీఎం శ్రీనివాస్, గ్రామపంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

కోటగిరి : మండల పరిషత్ కార్యాలయంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైస్ ఎంపీపీ బాల్ థాకరే పేర్కొన్నారు. గ్రామ కార్యదర్శులు, సర్పంచులు పాల్గొన్న సమావేశంలో సూపర్‌వైజర్ కృష్ణవేణి మాట్లాడుతూ.. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఉచితంగా కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరిని పరిశీలించి అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు, కండ్లద్దాలు పంపిణీ చేస్తామని, ప్రతి ఒక్కరూ సహకరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీకాంత్‌రావు, ఎంపీడీవో మారుతి తదితరులు పాల్గొన్నారు.

రామారెడ్డి: మండలంలోని రామారెడ్డి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమంపై పి.హెచ్.సి వైద్యులు సురేష్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డెమో, డ్రైరన్ నిర్వహించారు. స్థానిక రైతు వేదికలో ఈనెల 18న ప్రారంభం కానున్న కంటి వెలుగు కార్యక్రమంపై ఏఎన్ఎంలకు, ఆశాలకు, వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ దండ బోయిన సంజీవ్, ఎంపీటీసీ రజిత రాజేందర్‌గౌడ్, ఎంపీఓ సవితారెడ్డి, అన్నారం పీహెచ్‌సీ వైద్యులు మానస, కంటి వెలుగు టీం సభ్యులు వైద్యులు హరీష్, స్వప్న, వైద్య సిబ్బంది భీం, దోమల శ్రీధర్, శ్రీహరి, రాజు, ఏఎన్ఎంలు, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ మాధవి బలరాజ్‌గౌడ్ అధ్యక్షతన మండల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాధవి బాలరాజ్‌గౌడ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ నెల 18 నుంచి నిర్వహిస్తున్న సందర్భంగా ప్రతి గ్రామ పంచాయతీల్లో కంటి వెలుగు కార్యక్రమం చేపట్టే విధంగా అన్ని ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. అనంతరం మత్తమాల పీహెచ్‌సీ డాక్టర్ శరత్‌కుమార్ మాట్లాడుతూ.. ఎల్లారెడ్డి మండలంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని 3 విభాలుగా కల్యాణి గ్రామంలో, అజమాబాద్, ఎల్లారెడ్డి 12వ వార్డుల్లో రోజుకు 100 మందికి కంటి వైద్య వైద్య పరీక్షలు చేసే విధంగా చూడాలని అన్నారు. 100 రోజుల్లో కంటి వెలుగు కార్యక్రమంలో అందరికీ పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. సమావేశంలో ఎంపీడీఓ మల్లికార్జున్‌రెడ్డి, ఎంపీఓ ప్రకాష్, జడ్పీటీసీ ఉషగౌడ్, ఆయా గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రెంజల్ : ఈ నెల 18 నుంచి ప్రారంభమయ్యే కంటి వెలుగు కార్యక్రమం కరపత్రాలను సర్పంచ్ గౌరాజి లలిత రాఘవేందర్, ఎంపీపీ రజనీకిషోర్, ఎంపీడీవో శంకర్, డాక్టర్ వినయ్‌కుమార్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రెండవ విడత కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి ఈ కరపత్రం చేరేలా ఐకేపీ సిబ్బంది, ఆశావర్కర్లు, అంగన్వాడీలతో పూర్తి చేయాలన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకునేలా ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, వైద్య సిబ్బంది సహకరించాలని వారన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ గౌసుద్దీన్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, హెచ్ఈఓ శ్రావణ్ కుమార్, మండల ఉపాధ్యక్షులు యోగేష్, రాఘవేందర్, ఐకేపీ సీసీ రాజయ్య, ఐకేపీ సిబ్బంది, ఆశావర్కర్లు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

ఈనెల 18 నుంచి ప్రారంభమయ్యే రెండో విడత కంటి వెలుగు కార్యక్రమంపై దూపల్లి సర్పంచ్ శనిగరం సాయిరెడ్డి, తాడ్‌బిలోలి సర్పంచ్ వెలుమల సునీత నరసయ్య, ఎంపీటీసీ చింతకుంట లక్ష్మి అవగాహనా సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో 18 సంవత్సరాల పైబడిన వారందరినీ కంటి వెలుగు కార్యక్రమంలో పాల్గొనేలా చూడాలన్నారు. ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆశావర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలు ఆయాలతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు.

భిక్కనూర్ : మండల కేంద్రంలో స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఈనెల 18వ తేదీ నుంచి ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు వైద్య ఆరోగ్య సిబ్బంది కలిసికట్టుగా కృషి చేయాలని మండల వైద్యులు ఆదర్శ్, హెలిమాలు సూచించారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ జానాబాయ్, ఏఎన్ఎంలు శ్యామల, మంజుల, మాధవి, ఆశాకార్యకర్తలు రేణుక, సుకన్య, కవిత, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈనెల 18వ తేదీన ప్రారంభించనున్న రెండవ విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఎంపీఓ ప్రవీణ్ కుమార్ తెలిపారు. శుక్రవారం మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామంలో నిర్వహించే కంటి వెలుగు స్థలాన్ని ఆయన వైద్య సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కంటివెలుగుకు ఎలాంటి లోటుపాట్లు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం హేమలత, ఆశా వర్కర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఎడపల్లి : కంటి వెలుగు కార్యక్రమాన్ని సమిష్టి కృషితో విజయవంతం చేయాలని మోస్రా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రాజ్‌కుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అన్ని గ్రామాలలో కంటి వెలుగు పథక కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వైద్య ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగు ట్రయల్ రన్..

ఎల్లారెడ్డి : మండలంలోని కల్యాణి, అజమాబాద్, ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని 12వ వార్డులో మత్తామాల పీహెచ్‌సీ డాక్టర్ శరత్ కుమార్ ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీన జరిగే కంటి వెలుగు కార్యక్రమంపై ట్రయల్ రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

వర్ని : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని గ్రామాలలో ప్రతి ఒక్క ఆశా వర్కర్లు అంగన్వాడి టీచర్లు పంచాయతీ సెక్రెటరీ పక్కడబందీగా చేపట్టాలని ఎంపీడీవో నీలావతి అన్నారు శుక్రవారం చందు మండల కేంద్రంలోని రైతు వేదికలో కంటి వెలుగు ప అవగాహన సదస్సును ఏర్పాటు చేసినారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి గ్రామంలోని పంచాయతీ కార్యదర్శిలు కంటి వెలుగు కార్యక్రమంలో వచ్చే ప్రజలకు వసతులు సౌకర్యాలు కల్పించాలని తెలిపినారు ప్రతి కార్యక్రమానికి విజయవంతం చేయడానికి ప్రతి ఒక్క ప్రభుత్వ సంస్థ ఉద్యోగులు కృషి చేయాలని తెలిపినారు ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దశగౌడ్ ఎంపీవో తారాచంద్ దేవి సింగ్ లు తదితరులు పాల్గొన్నారు.

యువకులు.. నాయకత్వ లక్షణాలు
పెంపొందించుకోవాలి

- ఎమ్మెల్యే జాజాల సురేందర్

నవతెలంగాణ-తాడ్వాయి


నగదు బహుమతిని అందజేస్తున్న ఎమ్మెల్యే సురేందర్

యువకులు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో నియోజక వర్గస్థాయి వాలీబాల్ టోర్నమెంట్ క్రీడల ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడారు. యువకులు అన్ని రంగాల్లో రాణించడానికి కృషి చేయాలని కోరారు. క్రీడల్లో ఓడిన వారు నిరుత్సాహపడవద్దని సూచించారు. ఓటమి అనేది గెలుపునకు నాంది అని తెలిపారు. విద్యార్థులు, యువకులు క్రీడల్లో మంచి నైపుణ్యం సాధించి రాష్ట్రస్థాయిలో, దేశస్థాయిలో గుర్తింపు తీసుకురావాలని సూచించారు. మండల కేంద్రంలో పెండింగ్‌లో ఉన్న మినీ స్టేడియం నిర్మాణానికి కృషి చేస్తానని తెలిపారు. అనంతరం క్రీడలలో విజయం సాధించిన ప్రథమ, ద్వితీయ, తృతీయ జట్లకు బహుమతులు అందించారు. అనంతరం కృష్ణాజివాడిలో ఇటీవల లారీ ప్రమాదంలో ధ్వంసమైన ఇంటి బాధితులకు ఎమ్మెల్యే పరామర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ కౌడి రవి, వైస్ ఎంపీపీ నర్సింలు, సర్పంచ్ సంజీవులు, టీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు వెల్మ రవీందర్‌రెడ్డి, సదాశివనగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పులగం సాయిరెడ్డి, నాయకులు మహేందర్‌రెడ్డి రాజు, రాజాగౌడ్, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

మండల కేంద్రంలో బీసీ సంక్షేమ సంఘం మండలాధ్యక్షులు సంపంగి దయాకర్ ఆధ్వర్యంలో బీసీ సంక్షేమ సంఘం కామారెడ్డి జిల్లా క్యాలెండర్‌ను ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా అధ్యక్షులు సాప శివరాములు, జిల్లా ఉపాధ్యక్షులు సీహెచ్ రాజయ్య, కుమ్మరి నరేష్, మారోజు మోహనాచారి, మండల ఉపాధ్యక్షులు పోలీసు శ్రీధర్‌రావు, మండల కార్యదర్శి రణదీప్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐని సన్మానించిన ప్రజాప్రతినిధులు

నవతెలంగాణ-జుక్కల్


ఎస్ఐని సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

జుక్కల్ ఎస్ఐని కేమ్రాజ్‌కల్లాలీ గ్రామ ప్రజాప్రతినిధులు శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా కేమ్రాజ్‌కల్లాలీ మాజీ సర్పంచ్ సుంకరి వెంకటి మాట్లాడుతూ.. జుక్కల్ ఎస్ఐగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన బి.మురళిని జుక్కల్ ప్రాంత సాంప్రదాయపరంగా మహారాష్ట్ర టోపీ పెట్టి శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకన్న, బాబు, బీఆర్ఎస్ నాయకులు సుంకరి అనిల్, మాదాల వీరేషం తదితరులు పాల్గొన్నారు.

ఊట్‌పల్లిలో ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ

నవతెలంగాణ-బోధన్

మండలంలోని ఊట్‌పల్లి గ్రామంలో రుద్రూర్ కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు గ్రామస్తులకు ప్రకృతి వ్యవసాయంపై శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీకే శాస్త్రవేత్త డా.సురేష్ మాట్లాడుతూ.. వానపాముల ఎరువు తయారీ, ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన శిక్షణ నిర్వహించినట్టు తెలిపారు. సేంద్రియ వ్యవసాయం వల్ల లాభాలు, వానపాముల ఎరువు తయారీ వల్ల ప్రయోజనాలు, సహజ వ్యవసాయం విధానాలతో రైతులకు కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. రైతులు సేంద్రియ ఎరువులను ఉపయోగించాలని, దానితో భూసారం పెరిగి అధిక దిగుబడులు వచ్చే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కృష్ణ, సర్పంచ్, డీఆర్‌డీఓ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రాచయ్య, ఏపీఎం గంగారం గ్రామస్తులు పాల్గొన్నారు.

తపాల బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-లింగంపేట్



తపాల బీమా పథకాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పోస్టల్ డిపార్ట్‌మెంట్ అందిస్తున్న పోస్టల్ బీమా పథకాలను ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని నిజామాబాద్ పోస్టల్ డివిజన్ కామారెడ్డి సబ్ డివిజన్ అధికారి శ్రావణ్ కుమార్ అన్నారు. శుక్రవారం లింగంపేట్ సబ్ పోస్టాఫీస్ పరిధిలో బీమా పథకాలు, వివిధ రకమైన పోస్టల్ పథకాలపైన ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా పోస్టల్ అధికారులు, సిబ్బంది కలిసి ప్రభుత్వ కార్యాలయాలు, ఇంటింటికి వెళ్లి సుకన్య సమృద్ధి యోజన, రికరింగ్ డిపాజిట్ పథకం, సేవింగ్స్ పథకం, గ్రామీణ తపాలా బీమా, తదితర పథకాలు, ఖాతాలపై ప్రజలకు క్లుప్తంగా వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తపాలా శాఖలో ప్రజలకు ఉపయోగపడే పలు పథకాలు ఎక్కువ వడ్డీ రేటును అందిస్తున్నాయని తెలిపారు. గ్రామీణ తపాల బీమా ఎక్కువ బోనస్ అందిస్తుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మెయిల్ ఓవర్సెర్ మహబూబ్‌రెడ్డి, ఎస్ఎంపీ మురళి, పోస్టల్‌శాఖ సిబ్బంది లింగం, నితీన్, వినోద్, మానుష, రోషన్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

విద్యార్థి శ్రీకాంత్ మృతి ఘటన కేసును సీబీఐకి అప్పగించాలి

నవతెలంగాణ-బోధన్


పాదయాత్రగా తరలివెళ్తున్న లింగాయత్ నాయకులు

బోధన్ మండలం ఖండ్‌గాం గ్రామానికి చెందిన డిగ్రీ విద్యార్థి శ్రీకాంత్ మృతి ఘటన కేసును సీబీఐకి అప్పగించాలని అఖిల భారతీయ వీరశైవ లింగాయత్ యువ సంఘటన వ్యవస్థాపక అధ్యక్షులు మనోహర్ దోండే డిమాండ్ చేశారు. శుక్రవారం బోధన్ పట్టణంలో శ్రీకాంత్ కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ స్థానిక ఏకచక్ర ఆలయం నుంచి భారీ పాదయాత్రగా ఆర్డీవో కార్యాలయానికి తరలివెళ్లారు. ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టి ఆర్డీవో రాజేశ్వర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ కేసును సీబీఐకి అప్పగించాలని, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఏఎస్ఐ రవీందర్, ఏసీపీ కిరణ్‌కుమార్‌లపై డిపార్ట్మెంట్ విచారణ జరిపి, సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. శ్రీకాంత్ కుటుంబానికి ప్రభుత్వం రక్షణ కల్పించాలని, బాధిత కుటుంబానికి ఆర్థికంగా ఆదుకోవాలని అన్నారు. నిందితులపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వీరశైవ లింగాయత్ సమాజ్ నాయకులు న్యాయవాది శ్యామ్‌రావు, లక్ష్మణ్ పటేల్, రాజప్ప తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ విత్తనాలను పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలి

- పశు వైద్యులు బండివార్ విజయ్

నవతెలంగాణ-మద్నూర్

సబ్సిడీ విత్తనాలను పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని పశు వైద్యులు బండివార్ విజయ్ తెలిపారు. శుక్రవారం సబ్సిడీ విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని పశువైద్యశాల ఆవరణలో స్థానిక సర్పంచ్ సురేష్, ఉప సర్పంచ్ విట్టల్, పశువైద్యులు విజయ్, పశు వైద్య సిబ్బంది ప్రారంభించారు. ఈ సందర్భంగా పశువైద్యులు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం 75శాతం సబ్సిడీపై ఐదు కిలోల బ్యాగు రూ.61కి అందజేస్తుందని, పశువుల మేత కోసం పశువుల దారులు తీసుకు వెళ్లి ఈ విత్తనాలు సాగు చేస్తే 45 రోజులకు కోతకు వస్తుందని తెలిపారు. మూడుసార్లు జొన్నపంట కోతకు వస్తుందని, ఇలాంటి విత్తనాలను పశువుల దారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయదారులు, పశువులదారులు పాల్గొన్నారు.


సబ్సిడీ విత్తనాలు అందజేస్తున్న దృశ్యం

జుక్కల్ మెడికల్ ఆఫీసర్‌గా విఠల్ బాధ్యతల స్వీకరణ



నవతెలంగాణ-జుక్కల్

జుక్కల్ మెడికల్ ఆఫీసర్‌గా డా.విఠల్ జనవరి 1నుంచి బాధ్యతలు చేపట్టారని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ విఠల్ మాట్లాడుతూ.. ఆసుపత్రికి వచ్చే పేద ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి సేవలందిస్తానని, ఆస్పత్రి అభివృద్ధికి కృషి చేస్తానని, వైద్యారోగ్య శాఖ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పథకాలను లబ్దిదారులకు అందిస్తామని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు సేవ చేయడం చాలా సంతోషంగా ఉందని, స్థానికుడిని కావడం వలన భాషా పరంగా ప్రజలతో మమేకం కావొచ్చని ఆయన అన్నారు.

ఆలయాల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయండి

- దేవాదాయ శాఖ మంత్రిని కలిసిన ఆర్టీసీ చైర్మన్



నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో ఆలయాల నిర్మాణాలు నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి శ్రీ ఇంద్రకరణ్ రెడ్డిని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ శుక్రవారం హైదరాబాద్‌లో కలిశారు. ఆలయ నిర్మాణాలకు నిధులతోపాటు పలు ఆలయ అంశాలపై చర్చించారు.

క్రిమిలేయర్‌ను రద్దు చేయాలి

- బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలి
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

దేశంలో ఏ సామాజిక వర్గానికి లేనటువంటి క్రిమిలేయర్ ను కేవలం బీసీల రిజర్వేషన్లపైనే బలవంతంగా రుద్దుతున్నారని క్రిమిలేయరు మూలంగా బీసీలకు రావలసినటువంటి రిజర్వేషన్లు రాకుండా కోల్పోతున్నామని, అలాగే బీసీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లను 27 శాతం నుంచి 50 శాతం పెంచాలని, బీసీ ఉద్యోగులకు కూడ ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం నిజామాబాద్ పట్టణంలోని న్యూ అంబేద్కర్ ఆడిటోరియమ్ లో బీసీ ఉపాధ్యాయ సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో సామాజిక సంఘసంస్కర్త, భారత దేశపు మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు శ్రీమతి సావిత్రిబాయి పూలే 192 వ జయంతి జయంతి సందర్భంగా సావిత్రిబాయి పూలే అవార్డులను ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి బీసీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు మాడవేడి వినోద్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ముఖ్య అతిథులుగా బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్, నిజామాబాద్ జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్న గారి విఠల్‌రావు, మహిళా ఆర్థిక సహకార కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ ఆకుల లలిత, నిజామాబాద్ మేయర్ దండు నీతు కిరణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ రంగా లో ప్రభుత్వ



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్



ఉపాధ్యాయులకు అవార్డులు

ఉపాధ్యాయులు మహిళా ఉద్యోగులు వివిధ రంగాల్లో సేవా ప్రతిభ కనబరిచినటువంటి వంద మంది మహిళలకు సావిత్రిబాయి పూలే పేరు మీద అవార్డులను అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం వరుసగా ఇస్తున్న ఉద్యోగాల నోటిఫికేషన్‌లలో అనవసరంగా బీసీ క్రిమిలేయర్ సర్టిఫికెట్ లను అడుగుతున్నారని ఇది పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమని ఆయన అన్నారు. తక్షణమే టీఎస్పీఎస్సీ వారు బీసీ క్రిమిలేయర్ ను అమలును నిలిపివేలని ఆయన డిమాండ్ చేశారు. బీసీ క్రిమిలేయర్ మూలంగా రాష్ట్రంలోని ఎంతోమంది చిన్న చిన్న ఉద్యోగాలు చేసేవారు నష్టపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే బీసీ క్రిమిలేయర్ ను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇదే సమయంలో దేశంలో అన్ని వర్గాలకు వారి జనాభా దామాస ప్రకారం రిజర్వేషన్లు కల్పిస్తున్నటువంటి ప్రభుత్వాలు, బీసీలకు మాత్రం జనాభా దామాష్ ప్రకారం కల్పించకపోవడం మూలంగా బీసీలు విద్య , ఉద్యోగ రాజకీయ రంగాల్లో అవకాశాలు కోల్పోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు ఎస్సీలకు, ఎస్ టి లకు, చివరికి అగ్రకులాలకు కూడ జనాభా దామషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించి బీసీలు మాత్రం 60 శాతం జనాభ ఉంటే కేవలం రిజర్వేషన్లు 27 శాతమే ఎలా కల్పిస్తారని ఆయన ప్రశ్నించారు. బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు ప్రమోషన్లలో కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్ లేకపోవడం మూలంగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో బీసీలు స్వాతంత్రం వచ్చిన 75 సంవత్సరాల తర్వాత కూడా 18 శాతం దాటడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు

అలాగే ఈ దేశంలో మహాత్మ జ్యోతిబాపూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలను పార్లమెంట్లో ప్రతిష్ఠించాలని ఆయన డిమాండ్ చేశారు. సావిత్రిబాయి పూలే జయంతిని దేశవ్యాప్తంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. జీవితాంతం మహిళ విద్యాభివృద్ధి కోసం కృషి చేసినటువంటి సావిత్రిబాయి పూలే పేరును రాష్ట్ర ప్రభుత్వం మహిళా యూనివర్సిటీకి పెట్టాలని డిమాండ్ చేశారు. బీసీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుంకర శ్రీనివాసరావు, బిసి విద్యావంతుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూరయ్య గౌడ్, బీసీ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాఘవపురం గోపాలకృష్ణ, బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బుస్సా ఆంజనేయులు, ఒలింపిక్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొబ్బిలి నర్సయ్య, బిసిటియు మహిళా అధ్యక్షురాలు ఎన్ విజయలక్ష్మి, ఉపాధ్యక్షురాలు ప్రతిభ, బిసి నాయకులు తోట రాజశేఖర్, పెద్దొళ్ల నాగరాజు, కరిపె రవింధర్, సంజీవ్, రాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మాణిక్‌రావు ఠాక్రేను కలిసిన కాంగ్రెస్ నాయకులు



మాణిక్‌రావు ఠాక్రేతో నాయకులు

నవతెలంగాణ-గాంధారి

తెలంగాణ నూతన ఏఐసీసీ కార్యదర్శి తెలంగాణ కాంగ్రెస్ పార్టీ నూతన ఇంచార్జిగా ఎన్నికైన మాణిక్‌రావు ఠాక్రేను గాంధారి మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బామాన్ సురేష్ మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

లయన్స్ ఫౌండర్ జయంతి వేడుకలు



నివాళులర్పిస్తున్న పలువురు

నవతెలంగాణ-ఆర్మూర్

లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫౌండర్ లయన్ మెల్విన్ జోన్స్ జయంతి సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ నవనాథపురం ఆధ్వర్యంలో లయన్స్ భవనంలో శుక్రవారం ఘనంగా జయంతి వేడుకలు నిర్వహించారు. లయన్స్ చటర్ మెబెర్, లయన్స్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ జగదీశ్వర్ రెడ్డి కంటి పరీక్షలకు, ఐఎల్ఓ సర్జరీకి వచ్చిన పేషంట్‌లతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా లయన్ ప్రెసిడెంట్ లయన్ చెన్న రవికుమార్ మాట్లాడుతూ... లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫౌండర్ మెల్విన్ జోన్స్ 150 దేశాలలో లయన్ క్లబ్‌లు స్థాపనకు దోహదపడ్డారన్నారు. కార్యక్రమంలో జోనల్ చైర్మన్ లయన్ పుప్పాల శివరాజ్ కుమార్, లయన్ అంబల్ల తిరుపతి, లయన్ జ్ఞాని చావ్లా, లియో మెబెర్ సుంకరి రమణ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీల్లో కనీస వేతనాలు అమలు చేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సిబ్బంది

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

కేజీబీవీ నాన్ టీచింగ్, వర్కర్స్ కు ఉద్యోగ, ఆరోగ్య భద్రత కల్పించాలని, కనీస వేతనాలను తక్షణమే అమలు చేయాలని ఐఎఫ్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్, డిమాండ్ చేశారు. ప్రగతిశీల కేజీబీవీ నాన్ టీచింగ్, వర్కర్స్ యూనియన్ ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి ఏవోకు వినతి పత్రం అందచేసి మాట్లాడారు. 16 ఏండ్లుగా పనిభారంతో అనారోగ్యాలకు గురయ్యారని వాపోయారు. ప్రభుత్వం నుండి మెడికల్ ఇన్సూరెన్స్, ఆరోగ్య భద్రత లేదన్నారు. కాంటాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులకు వేతనాలు పెంచుతూ ఇచ్చిన జీవో నెం.60 కూడా వీరికి అమలు కావడం లేదనీ తెలిపారు. ఖాళీలు భర్తీ చేయడం లేదన్నారు. కేజీబీవీల్లో పనిచేసే సిబ్బందికి ప్రభుత్వ ఉద్యోగాల్లో వెయిటేజీ ఇవ్వడం లేదన్నారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎల్.ఈశ్వరి, రాష్ట్ర నాయకులు హేమలత, జిల్లా నాయకులు మురళి, నాయకులు బబిత, హారిక, సుమలత, కల్యాణి, అనూష, సావిత్రి, శారద, సునిత, గంగామణి, మీరజ్, విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగు కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలి

- ఎంపీపీ రజనీ కిషోర్



మాట్లాడుతున్న ఎంపీపీ రజనీ కిషోర్

నవతెలంగాణ-రెంజల్

ఈ నెల 18 నుంచి ప్రారంభమయ్యే కంటి వెలుగు కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీపీ రజనీ కిషోర్ స్పష్టం చేశారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో కంటి వెలుగుపై అవగాహనా సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమంలో 18 సంవత్సరాల పైబడిన వారందరికీ కంటి పరీక్షలు నిర్వహించడానికి అన్ని శాఖలకు సంబంధించిన సిబ్బందిని భాగస్వాములు చేయాలని ఆమె పేర్కొన్నారు. వంద రోజులలో ఈ కార్యక్రమానికి అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో శంకర్, డాక్టర్ వినయ్‌కుమార్, ఎంపీఓ గౌసుద్దీన్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఏపీఎం చిన్నయ్య, రెంజల్ గ్రామపంచాయతీ కార్యదర్శి రాజేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఇంచార్జ్ ఎంపీడీఓకు ఘనంగా సన్మానం



ఇంచార్జి ఎంపీడీవోను సన్మానించిన కార్యదర్శులు, సర్పంచ్‌లు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఇంచార్జ్ ఎంపీడీఓ మల్లికార్జున్‌రెడ్డికి సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు శుక్రవారం శాలువా కప్పి సన్మానించారు. గత కొంతకాలంగా ఎల్లారెడ్డి ఇంచార్జ్ ఎంపీడీఓగా బాధ్యతలు నిర్వహిస్తున్న మల్లికార్జున్‌రెడ్డి తిరిగి లింగంపేట్ మండల ఎంపీడీఓ బాధ్యతలు చేపడుతున్న సందర్భంగా అతనికి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఇంచార్జ్ ఎంపీడీఓ మల్లికార్జున్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎల్లారెడ్డి మండలంలో విధులు నిర్వర్తించిన తనకు సహకరించిన నాయకులకు, అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

రాష్ట్రస్థాయి బాల్ బ్యాట్మెంటన్ పోటీల్లో సెమీఫైనల్‌కు జిల్లా జట్లు

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఖమ్మం జిల్లా బోనకల్లులో జరుగుతున్న 67వ తెలంగాణ రాష్ట్ర స్థాయి జూనియర్ బాల్ బ్యాట్మెంటన్ బాలుర, బాలికల క్రీడా పోటీల్లో నిజామాబాద్ జట్లు సెమీఫైనల్‌కు చేరాయి. బాలుర నిజామాబాద్ జట్టు నల్గొండ జట్టుపై, అదిలాబాద్ జట్టుపై, రంగారెడ్డి జట్టుపై విజయం సాధించి సెమీఫైనల్ చేరారు. నిజామాబాద్ బాలికల జట్టు నల్గొండ, అదిలాబాద్, జట్లపై విజయం సాధించి సెమీఫైనల్‌కు చేరాయి. ఈసందర్భంగా జిల్లా బాల్ బ్యాట్మెంటన్ సంఘం అధ్యక్షులు మానస గణేష్, ప్రధాన కార్యదర్శి బి.శ్యామ్, సలహాదారులు హనుమంత్ రెడ్డి, విద్యాసాగర్ రెడ్డి, మల్లేష్ గౌడ్, ఉపాధ్యక్షులు కిషన్, కిషోర్ , రాజకుమార్, సంఘ సభ్యులు, కోశాధికారి రాజేశ్వర్, నిర్వహణ కార్యదర్శి కృష్ణమూర్తి, నాగేష్ మాధురి సురేష్ వినోద్, క్రీడాకారులను అభినందించారు.

చదువు ద్వారానే భవిష్యత్తు

- జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి లోలం రఘురాజ్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

విద్యార్థులకు చదువు ద్వారానే భవిష్యత్తు నిర్మాణం జరుగుతుందని, చదువు పట్ల ఎలాంటి నిర్లక్ష్యం చేయవద్దని, వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని నిజామాబాద్ జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి లోలం రఘురాజ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఘన్‌పూర్ గ్రామంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కళాశాల వార్షికోత్సవ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రఘురాజ్ పాల్గొన్నారు. నిజామాబాద్ జిల్లా ప్రిన్సిపాల్ సంఘం అధ్యక్షులు డాక్టర్ చిరంజీవి మాట్లాడుతూ విద్యార్థులు పెళ్లికి ఆకర్షితులు కావద్దని, ముందుగా మంచి చదువులు నేర్చుకోవాలని, చదువుకు వయసుతో ఎలాంటి సంబంధం లేదని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ చంద్ర విట్టల్ మాట్లాడుతూ.. కళాశాల గత పరీక్షలలో రాష్ట్రస్థాయి ఫలితాలను సాధించి కలెక్టర్‌తో అభినందనలు పొందినట్లు తెలిపారు. రాబోయే వార్షిక పరీక్షలకు సిద్ధం కావాలని, మరోసారి సత్తా చాటి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తెచ్చే విధంగా



నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

విద్యార్థులు కృషి చేయాలని సూచించారు. వివిధ క్రీడాంశాలలో ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రభుత్వ అధ్యాపకుల సంఘం అధ్యక్షులు నర్సయ్య, ధర్పల్లి కళాశాల ప్రిన్సిపాల్ రజియోద్దీన్, బాల్కొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ చిన్నయ్య, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అంతకు ముందు సాంస్కృతిక కార్యక్రమం నిర్వహించి పాటలతో హోరెత్తించారు.

పసుపు రైతును నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వాలు

నవతెలంగాణ-కమర్‌పల్లి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పసుపు రైతును నిర్లక్ష్యం చేస్తున్నాయని కాంగ్రెస్ పార్టీ కిసాన్ ఖేత్ మండల అధ్యక్షుడు పడిగెల ప్రవీణ్ అన్నారు. శుక్రవారం మండలంలోని హస కొత్తూర్‌లో రైతులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. పసుపు రైతులు ఆరు నెలలు కష్టపడి పండించి మార్కెట్ కు తీసుకుపోతే ధర లేక, పెట్టిన పెట్టుబడి కూడా రాక, చేసిన కష్టం వృథా అయి రైతులకు కన్నీళ్లు మిగులుతున్నాయన్నారు. మద్దతు ధర విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నువ్వంటే నువ్వు అని ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవడమే తప్ప పసుపు రైతులకు శాశ్వత పరిష్కారం చూపడం లేదన్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో స్థానిక ఎంపీ అరవింద్ పసుపు బోర్డు తీసుకువస్తానని హామీ ఇచ్చి



మాట్లాడుతున్న పడిగెల ప్రవీణ్

ఇప్పటివరకు తీసుకురాలేదని అన్నారు. ఈ విషయమై ఎంపీని ప్రశ్నిస్తే రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి పసుపు బోర్డు కోసం లేఖ రాయడం లేదని అంటున్నారని పేర్కొన్నారు. జిల్లా మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పసుపుబోర్డు విషయమై ముఖ్యమంత్రి కేసీఆర్‌తో మాట్లాడి కేంద్రానికి లేఖ రాయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున పసుపు రైతులకు క్వింటాలకు రూ. మూడు వేల బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పక్కనే ఉన్న తెలుగు రాష్ట్రం వాళ్ళు గతంలో ఇచ్చిన విధంగా ఇక్కడి రైతులకు ఇవ్వాలని, లేకుంటే రైతులు తీవ్రంగా నష్టపోతారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాసిన తర్వాత ఎంపీ అరవింద్ పసుపు బోర్డు తీసుకురాకపోతే గ్రామాల్లో తిరగనివ్వమని హెచ్చరించారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పసుపు రైతులను ఆదుకోవాలని, లేకుంటే పసుపు రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. సమావేశంలో రైతు నాయకులు కొమ్ముల సంతోష్, గోపిడి లింగారెడ్డి, ఏలేటి సంతోష్, ఏనుగు అశోక్, గడ్డం సంతోష్, గంగారాం, లింగన్న, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

జీపీ ఆస్తులు రికార్డుల్లో పొందుపరచాలి

- డీఎల్‌పీఓ సురేందర్

నవతెలంగాణ-లింగంపేట్

గ్రామపంచాయతీకి సంబంధించిన స్థిరాస్తులు, చెరాస్తులు రికార్డుల్లో పొందుపరచాలని డీఎల్పీఓ సురేందర్ సూచించారు. శుక్రవారం మండలంలోని జల్దిపల్లి గ్రామపంచాయతీని తనిఖీ చేశారు. అనంతరం గ్రామంలో చేపట్టిన మురికి కాలువలు, సీసీ రోడ్లు, శ్మశానవాటిక, వర్మి కంపోస్ట్ నర్సరీ, పారిశుధ్య పనులను వీధి వీధి తిరుగుతూ పరిశీలించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామపంచాయతీలో పలు రికార్డులను పరిశీలించారు. పారిశుధ్యం లోపించకుండా గ్రామపంచాయతీ సర్పంచ్ పనితీరు బాగుందని ఆయన అన్నారు. 100శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని ఆయన సూచించారు. ప్రతి



రికార్డులను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ

కుటుంబంలోని ఒక సభ్యుని ఆధార్ నెంబర్, ఫోన్ నెంబర్, గ్రామపంచాయతీ రికార్డులు ఉండాలని ఆయన అన్నారు. ఆయన వెంట సర్పంచ్ కల్లు రవీందర్, కార్యదర్శి వినోద, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

సంక్రాంతి పండుగను పురస్కరించుకుని రాష్ట్ర రోడ్లు-భవనాల శాఖా మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, కలెక్టర్ సి.నారాయణ రెడ్డి జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. భోగభాగ్యాలనిచ్చే భోగి, సరదాలు పంచే సంక్రాంతి మరింత ఆనందం పంచాలని వారు ఆకాంక్షించారు. అనుకున్న పనులన్నీ నెరవేరాలని, ఏడాది పొడుగునా ఇంటింటా సిరుల కాంతులు విలసిల్లాలని అభిలషించారు.

పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ నగరంలో ప్రభుత్వం వెంటనే అర్హులైన నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్, సిపిఐ రాష్ట్ర నాయకులు కే.భూమ య్య డిమాండ్ చేశారు. శుక్రవారం నిజామాబాద్ నగరంలోని నాగారంలో ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను సిపిఐ బందం పరిశీలించారు. నాగారంలో డబుల్ బెడ్రూంలు నిర్మించి ఏండ్లు గడుస్తున్న ప్రభుత్వ నిర్లక్ష్యంతో పేదలకు రెండు గదుల ఇండ్లు పంపిణీ చేయడం లేదని దుయ్యాబట్టారు. కిటికీల అద్దాలు పగలగొట్టారని, కరెంటు బోర్డులు, వైర్లు,కరెంట్ పైపులు కోసుకొని ఎత్తుకెళ్ళతున్నారని పేర్కొన్నారు. అర్బన్ ఎమ్మెల్యే గణేష్ గుప్తా 1400 బెడ్ రూమ్ లు ఇస్తామని అమలుచేయలేదని ఆరోపించారు. ఇప్పటికైనా ఇవ్వకపోతే ఆందోళనలు తప్పవన్నారు. సిపిఐ జిల్లా నాయకులు వై.ఓమయ్యకె. రాజన్న, ఏ.రాజేశ్వర్ వై.రాజారెడ్డి, రఘురాం పాల్గొన్నారు.

అన్నారంలో వాలీబాల్ క్రీడలు ప్రారంభం

నవతెలంగాణ-రామారెడ్డి

రామారెడ్డి మండలంలో అన్నారం గ్రామంలో బీఆర్ఎస్ యూత్ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఒకరోజు వాలీ బాల్ టోర్నమెంట్‌ను బీఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకులు గంప శశాంక్ శుక్రవారం ప్రారంభించారు. క్రీడాకారులతో కొద్దిసేపు వాలీబాల్ ఆడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలు మానసికంగా, శారీరకంగా ఉత్తేజాన్నిస్తుందని, స్నేహబంధాన్ని పెంపొందిస్తుందని అన్నారు. ఎస్ఐ అనిల్, ఉప సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ యూత్ అధ్యక్షులు గడ్డం రవీందర్‌రెడ్డి, గ్రామ యూత్ అధ్యక్షులు చాట్ల లక్ష్మణ్, సతీష్‌గౌడ్ తదితరులున్నారు.